# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 9 ఆగస్టు – 2025 పేజీలు: 24








# సీట్లు లేవు

## ADMISSIONS ARE CLOSED 2025-26



# స్కూల్ ఫుల్






# గణిత గణపతి

హాయ్ ఫ్రెండ్స్... వినాయక చవితి కదా...
గణితంలో గణపతిని పూజిద్దామా..
గణితంలో త్రిభుజాలు, వృత్తాకారం, చతురస్రం, దీర్ఘచతురస్రాకారం వాడుతూ బొమ్మలు గీసేద్దాం.


గణిత గణపతి



వృత్త గణపతి



చతర్భుజ గణపతి




ధీర్ఘ వృత్తాకార గణపతి



రేఖా గణిత గణపతి



త్రిభుజ గణపతి



**–ఎస్.త్రినాథరావు,** హెచ్ఎం, పరశం, 9494166835

# మన బడి
## మాస పత్రిక




సంపుటి: 1 సంచిక: 9 ఆగస్టు – 2025 పేజీలు: 24

**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు. వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**డా. కృతికా శుక్లా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య

**ఎడిటర్**
**బి. శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా

**సలహాసభ్యులు**
**వి.ఎన్. మస్తానయ్య,** డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్. ప్రసన్నకుమార్,** ASPD -1
**డి. దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి. మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె. నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె. రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD -2
**వి. మనోహర్ నాయక్,** CMO
**కె. జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO

**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్

**సబ్ ఎడిటర్**
**గణేశ్ బెహరా,** PRO

**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి. వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె. శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ. సుహాసిని,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి. సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్. ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి. ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె. పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై. నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి. వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి. గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)

**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**

**చిత్రకారులు**
**మల్లిక్**

## ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ట మరింత పెరిగింది

దేశమును ప్రేమించుమన్నా
మంచి యన్నది పెంచుమన్నా
వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్
అన్నారు మహాకవి గురజాడ అప్పారావు గారు..

మన స్కూళ్ల ముందు నో అడ్మిషన్ బోర్డులు చూస్తే..ఉపాధ్యాయుల కృషి కళ్లకు కడుతోంది. ప్రభుత్వం ఆలోచనను కార్యాచరణలో పెట్టడం వల్లే ప్రభుత్వ స్కూళ్లలో ఎన్నడూ లేనంతగా ప్రవేశాలు పెరిగాయి. ప్రభుత్వ పథకాలు, పాఠశాలల్లో కల్పించిన మౌలిక సదుపాయాలు, టీచర్ల అంకితభావంతో ప్రభుత్వ విద్యాలయాల స్థాయి మరింత పెరిగింది. రాష్ట్రంలోని చాలా స్కూళ్లలో పరిమితికి మించి అడ్మిషన్స్ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

పూను స్పర్థను విద్యలందే

వైరములు వాణిజ్యమందే... అన్న గురజాడ వారి స్ఫూర్తితో గుణాత్మక విద్యను అందించేందుకు కార్పొరేటు విద్యా సంస్థలకు ధీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు పోటీపడటం మరో గొప్ప విజయం. ''మీ పిల్లల్ని మా బడిలో చేర్పండి'' అని బతిమాలుతూ వీధి వీధినా టీచర్లు తిరిగే రోజుల నుంచీ, ''మా పిల్లలను మీ బడిలో చేర్చుకోండి'' అంటూ తల్లిదండ్రులు బడుల చుట్టూ తిరగడం ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ట పెరిగిందనేందుకు నిదర్శనం. గవర్నమెంట్ స్కూళ్లలో సీట్ల కోసం రికమెండేషన్ లెటర్లు కూడా పట్టుకుని వచ్చిన ఉదంతాలున్నాయి. ఇది అందరి సమష్టి విజయం. కొనసాగిద్దాం. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్‌ని దేశానికి దిక్సూచిగా నిలుపుదాం.

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in

# భద్రతకు భరోసా నాణ్యతా చిరునామా

## ISI, Hallmark, Registration standard marks

**BIS నాణ్యతా చిహ్నాలపై ప్రజల్లో అవగాహన అవసరం**

**విద్యార్థి దశ నుంచే వస్తువుల నాణ్యత గుర్తించేలా పాఠ్యాంశాలు**

**దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో స్టాండర్డ్స్ క్లబ్స్ ఏర్పాటు**

**ఆకట్టుకునే ప్రకటనలు..**
**ఆశలు రేకెత్తించే ఆఫర్లు..**
**ఉరుకుపరుగుల జీవితాలు..**

ఏది మంచి వస్తువు, ఏది నాణ్యమైన పరికరం, ఏవి భద్రమైనవి ఎలా తెలుస్తాయి? కొన్న వస్తువు ఉపయోగపడకపోగా ప్రమాదం కొని తెస్తే... దానికి బాధ్యులు ఎవరు?

ఈ ప్రశ్నలన్నింటికీ ఒక్కటే సమాధానం... ఈ గుర్తులు గుర్తుంచుకోండి.. అవి మీ భద్రతకు భరోసానిస్తాయి. మీరు కొనుగోలు చేసిన వస్తువుల నాణ్యతకు చిహ్నంగా నిలుస్తాయి.

కోట్లాది మంది మన దేశ ప్రజలకు మార్కెట్లో దొరికే వస్తువులపై ఉన్న ISI, Hallmark, Registration standard marks వంటివాటిని పర్యవేక్షిస్తోంది బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS)

ఈ అమ్మకపు ప్రపంచంలో నమ్మకం అంటే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) చిహ్నాలే.

## గుర్తులు.. గుర్తుంచుకోవాల్సిందే

కొనుగోలు చేసిన హెల్మెట్‌పై ఉండే ఐఎస్ఐ (ISI) గుర్తు భద్రతకు భరోసానిస్తుంది.

ఇష్టపడి కొన్న బంగారు ఆభరణాలపై ఉండే హాల్‌మార్క్ (Hallmark) బంగారం స్వచ్ఛతకు హామీ ఇస్తుంది. ఎలక్ట్రానిక్ వస్తువులపై ఉండే రిజిస్ట్రేషన్ సింబల్ నాణ్యతకు చిరునామాగా నిలుస్తుంది.

ఇవన్నీ మనకు కనిపించే చిన్న లోగోలు కాదు. వినియోగదారుల భద్రతకు భరోసానిస్తూ, నాణ్యమైన వస్తువులను గుర్తించేందుకు మన కంటికి కనిపించకుండా పనిచేసే అతి పెద్ద రక్షణ వ్యవస్థ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS).

నిత్య జీవితంలో మన దేశ ప్రజలు వినియోగించేందుకు ఉత్పత్తులు, పొందుతున్న సేవలలో భద్రత, విశ్వసనీయత, శ్రేష్ఠతను హామీ ఇస్తూ, దేశ నాణ్యతా వ్యవస్థకు మూలస్తంభంగా పనిచేస్తోంది National Standards Bodyగా వ్యవహరించే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS).

## స్వాతంత్ర్యం వచ్చాక ఆవిర్భావం

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1947లో ఇండియన్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూషన్ (ISI) ఏర్పాటుతో ప్రామాణీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దశాబ్దాలుగా ఐఎస్ఐ గుర్తు నాణ్యతకు చిహ్నంగా నిలిచింది. భారతదేశ ఆర్థిక వ్యవస్థ విస్తరించి, ప్రజాఅవసరాలు పెరిగి, టెక్నాలజీ వేగం అందుకున్న అత్యాధునిక కాలంలో ప్రామాణిక ప్రక్రియ కోసం ఒక బలమైన వ్యవస్థ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏర్పడింది. దీని కోసం BIS Act of 1986 కింద బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ స్థాపన జరిగింది. ఇది ఒక చట్టబద్ధమైన సంస్థగా రూపాంతరం చెంది, మరిన్ని బాధ్యతలను స్వీకరించింది. 2016 నాటి మార్గదర్శక BIS Actతో వచ్చిన మార్పులతో మరిన్ని సేవలకు విస్తరించింది. హాల్‌మార్కింగ్ తప్పనిసరి చేస్తూ, ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను వెనక్కి తీసుకునేలా ఆదేశించడం, వినియోగదారుల రక్షణను చూసే అధికారాలను ఈ చట్టం BISకు కల్పించింది.

## బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) ప్రధాన విధులు

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) ప్రధాన విధి భారతీయ ప్రమాణాలను (Indian Standards) రూపొందించడం, ఉత్తర్వులు జారీ చేయడం. ఇది పరిశ్రమ, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు, వినియోగదారుల సంఘాలతో

ఏకాభిప్రాయ పద్ధతిలో జరుగుతుంది.

ఆహారం, ఎలక్ట్రానిక్స్, సివిల్ ఇంజనీరింగ్, వైద్య పరికరాలతో సహా 17 రంగాలలో 23,000 కంటే ఎక్కువ ప్రమాణాలను BIS రూపొందించింది. ఆయా రంగాల నిపుణులు, సంస్థల పర్యవేక్షణలో భద్రత, నాణ్యత పరీక్షలన్నీ పూర్తిచేసి ఈ ప్రమాణాలు నెలకొల్పింది.

## ఐఎస్ఐ మార్క్

ఉత్పత్తి ధృవీకరణను ISI గుర్తుతో ఇస్తోంది BIS. ఉత్పత్తుల యొక్క థర్డ్ పార్టీ హామీ ఇది. చాలా ఉత్పత్తులకు ISI స్వచ్ఛందం. ప్రజారోగ్యం మరియు భద్రతకు సంబంధించిన వస్తువులైన LPG సిలిండర్లు, విద్యుత్ ఉపకరణాలు, టైర్లు, హెల్మెట్లు మొదలైన వాటికి ISI తప్పనిసరి. దీనివల్ల ముఖ్యమైన వస్తువులను వినియోగదారునికి విక్రయించే ముందు కఠినమైన భద్రతా ప్రమాణాలకు ఉత్పత్తిదారుడు కట్టుబడి ఉండేలా చేస్తుంది.

IS XXXX

CM/L-XXXXXX

## హాల్‌మార్కింగ్

విలువైన లోహాలలో కల్తీ నుండి వినియోగదారులను రక్షించడానికి BIS హాల్‌మార్కింగ్ విధానాన్ని అవలంభిస్తోంది. ఆభరణాలపై ఉండే హాల్‌మార్క్ బంగారం, వెండి ఇతర లోహాల పరిమాణం యొక్క ఖచ్చితమైన పరీక్షను అందిస్తుంది. BIS ఆమోదించి బాధ్యతలు అప్పగించిన హాల్‌మార్కింగ్ సెంటర్ల ద్వారా లోహాల నాణ్యత ధృవీకరిస్తారు.

## ప్రయోగశాల సేవలు

BIS దేశవ్యాప్తంగా పది అత్యాధునిక ప్రయోగశాలలను నిర్వహిస్తోంది. ఈ ప్రయోగశాలల్లో వేలాది ఉత్పత్తుల నమూనాలను పరీక్షించి అవి భారతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని నిర్ధారిస్తారు. ఈ కఠినమైన పరీక్షలు పూర్తయ్యాక ఉత్పత్తులపై పడే BIS ధృవీకరణ చిహ్నాలు విశ్వసనీయతను ప్రతిబింబిస్తాయి.

## స్టాండర్డ్స్ క్లబ్స్..

భావితరాలకు నాణ్యతపై అవగాహన కోసం BIS విద్యార్థి దశ నుంచే చైతన్యం నింపే కార్యక్రమాలను ఆరంభించింది. దేశవ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో BIS స్టాండర్డ్స్ క్లబ్స్ 10,000కి పైగానే ఏర్పాటు చేసింది. తొమ్మిదవ తరగతి నుంచి విద్యార్థులను ఈ క్లబ్బులో చేరవచ్చు. అదే స్కూలులో ఆసక్తిగల విద్యార్థులు ఆధ్వర్యంలో నాణ్యత, ప్రామాణీకరణ ఆలోచనలను క్లబ్ సభ్యులైన విద్యార్థుల్లో నింపుతారు. స్టాండర్డ్స్ క్లబ్స్ విద్యార్థుల కోసం పాఠ్యాంశాలు రూపొందించారు. క్విజ్‌లు, చర్చలు, వ్యాసరచన పోటీలు, వర్క్‌షాప్‌ల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం పెంపొందిస్తోంది. ఇండస్ట్రియల్ టూర్లకు విద్యార్థులను తీసుకెళతారు.

STANDARDS CLUB

BUREAU OF INDIAN STANDARDS

## డిజిటల్ ఔట్ రీచ్

అధికారిక యూట్యూబ్ ఛానెల్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల ద్వారా BIS విద్యాపరమైన వీడియోల ద్వారా కొన్ని ప్రమాణాలు ఎందుకు చాలా ముఖ్యమైనవి? చట్టబద్ధమైన ధృవీకరణ గుర్తులను ఎలా గుర్తించాలో వినియోగదారులకు తెలియజేస్తున్నారు.

## నాణ్యత మిషన్

నాణ్యతను దేశవ్యాప్త మిషన్‌గా మార్చడానికి దేశంలోని ప్రఖ్యాత ఐఐటిలు, ఎన్ఐటిలు, ఐఐఎంలు, జాతీయ విశ్వవిద్యాలయాలు, రాష్ట్ర సాంకేతిక సంస్థలు, ప్రముఖ విద్యా మరియు పరిశోధనా సంస్థలతో 95 కంటే ఎక్కువ అవగాహన ఒప్పందాలపై సంతకం చేసింది BIS. విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, ఉమ్మడి పరిశోధన, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, గెస్ట్ లెక్చర్స్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తాయి. ఈ అవగాహన ఒప్పందాల ఫలితంగా, భారతదేశంలోని అనేక సాంకేతిక మరియు ఉన్నత విద్యా సంస్థలలో విద్యా పాఠ్యాంశాలలో ప్రమాణాల భావన ప్రవేశపెట్టబడుతోంది. విద్యార్థులు ప్రపంచ ప్రమాణాల పాత్ర గురించి నేర్చుకుంటున్నారు.

## BIS -కేర్ యాప్

సమాచారంతో కూడిన, సురక్షితమైన, మరియు నాణ్యత-ఆధారిత కొనుగోలు నిర్ణయాలు తీసుకోవాలనుకునే ఎవరికైనా ఒక స్మార్ట్ డిజిటల్ ఫ్రెండ్ BIS-Care App.




* ఐఎస్ఐ-మార్క్, హాల్‌మార్క్ చేయబడిన ఉత్పత్తుల యొక్క ప్రామాణికతను ధృవీకరించడం
* లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ నంబర్‌లను తనిఖీ చేయడం
* ప్రమాణాలకు అనుగుణంగా లేని ఉత్పత్తులపై ఫిర్యాదులు నమోదు చేయడం
* భారతీయ ప్రమాణాలు మరియు భద్రతా సూచనలు వంటి కీలక సమాచారాన్ని పొందడం

భావిభారత పౌరులైన విద్యార్థులు నాణ్యతా ప్రమాణాలపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకునేందుకు విద్యలో భాగమై, అనంతరం టెక్నాలజీ రూపంలో డిజిటల్ ఫ్రెండ్ అయింది BIS.

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) వస్తువులు, పరికరాలు, సేవల ప్రమాణాలను నిర్మిస్తుంది. ఆధునిక భారతదేశ నిర్మాణంలోనూ భాగం అవుతుంది.


**- చల్ల మధుసూదనరావు**

మీడియా కన్సల్టెంట్, సమగ్రశిక్షా



# తెలుసా ప్లాస్టిక్ కథ...



**చే**తిలో డబ్బులుంటే చాలు చంగుమంటూ షాపు దగ్గరకు వెళ్లి చాక్లెట్లు, బిస్కెట్, చిప్స్ ప్యాకెట్లు.. ఇలా ఎన్నోకొని తెచ్చుకుంటారు. మరి వాటిని తినడం వరకూ సరే, ఆ తినుబండారాలతోపాటు వచ్చే ఆకర్షణీయమైన కవర్లు ఎంత ప్రమాదకరమో తెలుసా. పర్యావరణానికి అవి చేసే హాని గురించి తప్పనిసరిగా ప్రతి ఒక్కళ్లూ తెలుసుకుని తీరాలి. ప్లాస్టిక్‌ను వాడకుండా అమ్మానాన్నలకీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపైనే ఉంది. అందుకే ప్లాస్టిక్ గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలే ఇవి.

పాలిథిన్ కవర్లు.. మనిషికీ, మట్టికీ మధ్య అడ్డుగోడలా నిలుస్తాయి. వాననీరు భూమిలో ఇంకిపోకుండా అడ్డుపడతాయి. ఫలితంగా భూగర్భ జలాలు అడుగంటిపోతాయి. విస్తారంగా, వానలుపడినా, నీటికి కటకటే. పాలిథిన్ కణాలు మట్టిలోని సత్తువనంతా మింగేస్తాయి. బంగారం పండే పొలమైనా, దెబ్బకి ఎడారిలా మారిపోవలసిందే. పచ్చగడ్డి కూడా మొలవదు. అయితే ఎక్కడికక్కడ పేరుకుపోయిన పాలిథిన్ చెత్తను తరలించే ఓపిక లేక తరలించడానికి వాహనాలు సరిపోక చాలా ప్రాంతాల్లో పారి శుధ్య సిబ్బంది కాల్చిపడేస్తున్నారు. కొండంత చెత్తకు చిన్న అగ్గిపుల్లతో పరిష్కారం అన్నమాట. అయితే ఆ మంటలోంచి కొన్నిరకాల విషవాయువులు పుట్టుకొచ్చి పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. పాలిథిన్ కొన్నేళ్ల తరవాత ముక్కలు ముక్కలైపోయి ప్లాస్టిక్ ధూళి ఏర్పడుతుంది. అది గాల్లో కలిసి పోయి ఒంట్లోకి ప్రవే శిస్తుంది. ఇవన్నీ క్యాన్సర్, మూత్రపిండ సమస్యలు, శ్వాస కోశ వ్యాధులు, చర్మ సమస్యలు .. ఇంకా అనేకానేక రోగాలకు కారణం అవుతున్నాయి. చెత్తకుండీల్లో మురుగు కాలువల్లో, ఆటమైదానాల్లో, ఖాళీ స్థలాల్లో ఎక్కడ చూసినా పాలిథిన్ కవర్లే. నగరాల్లో ఆ సమస్య మరీ ఎక్కువ. మురుగు కాలువల్లో పేరుకుపోయిన పాలిథిన్ వ్యర్థాలు డ్రైనేజీ ప్రవాహానికి అడ్డు తగులుతున్నాయి. దీంతో ఎక్కడి మురుగు అక్కడే నిలిచిపోతోంది. ఫలితంగా పారి శుధ్య సమస్య ఏర్పడుతోంది. మురికి నీటిలోని పాలిథిన్ కవర్లమీద మలేరియాకారక క్రిములు కాపురాలు పెడుతున్నాయి. అక్కడే గుడ్లు పెట్టి , పిల్లల్ని కని జనం మీదికి వదిలేస్తున్నాయి.

## మరి ఏం చేద్దాం?

బయటకు వెళ్లి ఏం కొన్నా ప్లాస్టిక్ కవరులోనే వాటిని మోసుకుంటూ ఇంటికి వస్తుంటారు ఎవరైనా. అందుకే పొద్దున లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ ప్లాస్టిక్ ఏదో ఒక రూపంలో ఇంటికి వరకూ వస్తోంది. వెయ్యేళ్లైనా భూమిలో కలిసి పోకపోగా మానవ మనుగడకు ముప్పును కలిగించే ఈ ప్లాస్టిక్ ను చాలామంది ఎలా పడితే అలా బయట పడేస్తుండటంతో- నేలపైన ప్లాస్టిక్ చెత్త పేరుకుపోయి పర్యావరణానికి హాని జరుగుతోంది. ఆ చెడుకు అడ్డు కట్ట వేయాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని ప్రభుత్వం నిషేధించింది. నిజానికి పాలిథిన్ దుష్ప్రభావాల నుంచి తప్పించుకోవడానికి నిషేధాలు సరిపోవు. నిజాయితీ కావాలి. జీవోలొక్కటే చాలవు. జన భాగస్వామ్యం అవసరం. దుకాణం నుంచి సరకులు మాత్రమే తెచ్చుకుందాం. పాలిథిన్ మనకెందుకు? ఉచితంగా ఇస్తామన్నా వద్దనే చెబుదాం. రూపాయి ఎక్కువైనా సరే, పర్యావరణానికి హాని చేయని సంచులే వాడదాం. ఉద్యమాలు ఎక్కడో పుట్టవు. ఎవరో ఒక వ్యక్తితోనే మొదలవుతాయి. ఏదో ఓ ఇంటి నుంచి ప్రారంభమవుతాయి. మరి ఎక్కడో ఎందుకు పాలిథిన్ వ్యతిరేక ఉద్యమాన్ని మన ఇంటి నుంచే, మన స్కూలు నుంచే మొదలు పెడదాం. మనమంతా నాయకులం అయి ముందుకు నడిపిద్దాం ఆ ఉద్యమాన్ని.

## ప్రత్యామ్నాయం ఏంటి?

ప్లాస్టిక్ సంచులకి ప్రత్యామ్నాయాలు:

1. **గుడ్డ సంచులు (Cotton Bags)**
   - మళ్లీ మళ్లీ వాడుకోవచ్చు
   - తేలికగా ఉతకవచ్చు
   - పర్యావరణానికి హానికరం కాదు
2. **జ్యూట్ సంచులు (Jute Bags)**
   - బలంగా ఉంటాయి
   - ప్రకృతి దోహదంగా తయారవుతాయి
   - పచ్చదనాన్ని ప్రోత్సహిస్తాయి
3. **కాగిత సంచులు (Paper Bags)**
   - సాధారణ వస్తువులు తీసుకెళ్లేందుకు అనువుగా ఉంటాయి
4. **బయోడిగ్రేడబుల్ ప్లాస్టిక్ సంచులు**
   - ఇవి చక్కగా కరుగుతాయి
   - పర్యావరణానికి తక్కువ హానికరం
   - కానీ ఇవి కూడా పూర్తిగా అవసరం లేని చోట వాడకూడదు
5. **నూలు సంచులు (Thread bags)**
   - చిన్న చిన్న వస్తువులకు అనువైనవి
   - పునర్వినియోగానికి ఉపయోగపడతాయి
6. **హోంమేడ్ బ్యాగులు**
   - ఇంట్లో తయారు చేయవచ్చు
   - వాటితో ఒక చిన్న క్రాఫ్ట్ ప్రాజెక్ట్ కూడా చేయవచ్చు

## అసలు ప్లాస్టిక్ ఎలా పుట్టిందో తెలుసా...

పందొమ్మిదో శతాబ్దం చివర్లో.. హాన్స వాన్ అనే జర్మన్ శాస్త్రవేత్త ఏదో ప్రయోగం చేస్తుంటే మెత్తమెత్తని, జిగట జిగట పదార్థమేదో గాజునాళిక అడుగున మిగిలిపోయింది. అదే తరవాత పాలిథిన్ గా అవతరించి, కొన్ని దశాబ్దాల్లోనే ప్రపంచమంతా విస్తరించింది. యమా చవకా, భలే తేలిక– ఇంకేముంది, వ్యాపారులు ఎగబడి కొన్నారు. జనం పరిపరి విధాలుగా ఉపయోగించడం మొదలుపెట్టారు. ఆ సౌకర్యానికి గులాములైపోయి, అనర్థాల గురించి ఆలోచించడమే మానేశారు. చెప్పేదేముంది, ప్రపంచమే ఓ పాలిథిన్ చెత్తబుట్టలా మారే ప్రమాదం ఏర్పడింది.




వీరుడైనా సార్వభౌముడైనా నేలలో కలసిపోవలసిందే. మెట్ట వేదాంతం కాదు. మట్టి వేదాంతం. పాలిథిన్ కవరు మాత్రం పురాణాల్లో రాక్షసుల టైపు. మట్టికొట్టుకుపోకుండా సృష్టి కర్త నుంచి మినహాయింపు పొందింది. వేయి సంవత్సరాలైనా దాని మనుగడకు ఢోకాలేదు. శుష్కించిపోకుండా శిథిలమైపోకుండా పాపి చిరాయువు అన్నట్టు దర్జాగా బతికేస్తోంది.

## మట్టిలో ఏ వస్తువు జీవితకాలం ఎంతో తెలుసా..

| | |
|---|---|
| కాయగూరలు | ఐదు రోజుల నుంచి నెల |
| అరటి తొక్క | 24 రోజులు |
| చెరకు పిప్పి | 30 నుంచి 60 రోజులు |
| కాగితం కవరు | 2 నుంచి 5 నెలలు |
| దూది | 1 నుంచి 5 నెలలు |
| దారం | 3 నుంచి 14 నెలలు |
| కమలాపండు తొక్క | 6 నెలలు |
| ఆకులు | ఏడాది |
| సిగరెట్ పీక | 1 నుంచి 12 ఏళ్లు |
| లెదర్ షూ | 25 నుంచి 40 ఏళ్లు |
| అల్యూమినియం డబ్బాలు | 80 నుంచి 100 ఏళ్లు |
| పాలిథిన్ | వేయి సంవత్సరాలు |


**– పద్మ వద్దె,**
పీఆర్వో, కాలుష్య నియంత్రణ మండలి









# పిల్లల్లో నైతిక విలువలు నిర్మాణాత్మకంగా పెంపొందించడం ఎలా?

పిల్లలూ,

మీ అందరికీ నా హృదయపూర్వక అభినందనలు! మీతో ఇలా మాట్లాడటం నాకు చాలా సంతోషంగా ఉంది. మీరందరూ చాలా మంచి పిల్లలు. మీలో ఒక్కొక్కరు ఒక్కో రత్నం లాంటివారు. అయితే, ఈ రత్నాలకు మెరుగులు పెట్టాలి కదా! అప్పుడే అవి మరింత ప్రకాశిస్తాయి. ఆ మెరుగులే మన నైతిక విలువలు.

చూడండీ పిల్లలూ, ఒక ఇల్లు ఎంత అందంగా ఉన్నా, దానికి గట్టి పునాది లేకపోతే అది కూలిపోతుంది కదా! అలాగే, మనం ఎంత పెద్దవాళ్ళమైనా, మనకు మంచి నడవడిక, మంచి గుణాలు లేకపోతే మన జీవితం కూడా అంతే. నైతిక విలువలు లేనివాళ్ళు ఎంత డబ్బు సంపాదించినా, ఎంత పేరు తెచ్చుకున్నా, లోపల మాత్రం ఏదో వెలితి ఉంటుంది. వాళ్ళ జీవితం ఒక అర్థం లేని ప్రయాణంలా ఉంటుంది. అందుకే, మీ జీవితం నిజంగా సంతోషంగా, అర్థవంతంగా ఉండాలంటే, మీరు తప్పకుండా నైతిక విలువలు కలిగి ఉండాలి.

ఇప్పుడు నేను మీతో మీ భాషలో, మీ మనసుకు హత్తుకునేలా కొన్ని మంచి విషయాలు చెబుతాను. ఇవి మీరు పాటించడానికి వీలుగా ఉంటాయి. మీ ఆటల్లో, మీ మాటల్లో, మీ ఆలోచనల్లో ఈ మంచి అలవాట్లు ఉండాలి.

## 1. నిజం చెప్పడం

ఎప్పుడూ నిజం చెప్పాలి. అబద్ధం చెప్పడం చాలా సులువుగా ఉంటుంది. కానీ, అది ఒకసారి మొదలుపెడితే, అది ఒక పెద్ద గొలుసులాగా అల్లుకుపోతుంది. ఒక అబద్ధాన్ని కప్పిపుచ్చడానికి మళ్ళీ ఇంకో అబద్ధం చెప్పాల్సి వస్తుంది. అదే నిజం చెబితే, ఒక్క క్షణం భయంగా ఉన్నా, తర్వాత మీ మనసు చాలా తేలికగా ఉంటుంది. మీ స్నేహితులు, మీ టీచర్లు, మీ అమ్మనాన్న మిమ్మల్ని నమ్ముతారు.



నమ్మకం అనేది చాలా గొప్ప విషయం పిల్లలూ! దాన్ని ఎప్పుడూ పోగొట్టుకోకండి.

## 2. దయ కలిగి ఉండటం

అందరితో దయగా ఉండాలి. మీ స్నేహితులతో, మీ ఇంట్లో వాళ్ళతోనే కాదు, వీధిలో కనిపించే జంతువులతో కూడా ప్రేమగా ఉండాలి. ఎవరైనా బాధలో ఉంటే, వాళ్ళను ఓదార్చాలి. ఎవరికైనా సహాయం చేయగలిగితే తప్పకుండా చేయాలి. గుర్తుపెట్టుకోండి, మీరు చేసే చిన్న సహాయం కూడా ఎవరికో ఒకరికి చాలా పెద్ద సంతోషాన్ని ఇవ్వగలదు.

## 3. గౌరవించడం

పెద్దవాళ్ళను గౌరవించాలి. మీ అమ్మనాన్న, మీ టీచర్లు, మీ తాతయ్య, నాయనమ్మ వీళ్ళందరూ ఎంతో అనుభవం ఉన్నవాళ్ళు. వాళ్ళు చెప్పే మంచి మాటలు మీ జీవితానికి వెలుగునిస్తాయి. వాళ్ళను ప్రేమగా చూడాలి, వాళ్ళ మాట వినాలి. అలాగే, మీకన్నాచిన్నవాళ్ళను కూడా ప్రేమగా చూడాలి. వాళ్ళకు మంచి విషయాలు నేర్పించాలి.



## 4. ఓపిక కలిగి ఉండటం

కొన్నిసార్లు మనం అనుకున్నది వెంటనే జరగకపోవచ్చు. అప్పుడు నిరాశ పడకూడదు. ఓపికగా ప్రయత్నించాలి. ఒకేసారి రాకపోతే మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాలి. మీరు ఒక మొక్కను నాటితే, అది వెంటనే పెద్ద చెట్టు అవ్వదు



కదా! దానికి సమయం పడుతుంది. అలాగే, మంచి ఫలితాల కోసం మనం ఓపికగా ఎదురుచూడాలి.

ఇప్పుడు కొన్ని ఆటలు, పనులు ద్వారా ఎలా నేర్చుకోవాలో చూద్దాం:

★ **"నిజం లేదా అబద్ధం" ఆట:** మీ స్నేహితులతో కలిసి ఒక విషయం చెప్పి, అది నిజమో కాదో చెప్పమని అడగండి. దీనివల్ల నిజం చెప్పడం యొక్క ప్రాముఖ్యత తెలుస్తుంది.

★ **"సహాయం చేద్దాం" కార్యాచరణ:** మీ ఇంట్లో లేదా మీ చుట్టుపక్కల ఎవరికైనా చిన్న సహాయం చేయండి. అది మొక్కలకు నీళ్ళు పోయడం కావచ్చు, పుస్తకాలు సర్దడం కావచ్చు.

★ **కథలు చెప్పడం:** మీ అమ్మానాన్నను లేదా తాతయ్య నాయనమ్మను మంచి నీతి కథలు చెప్పమని అడగండి. ఆ కథల్లోని మంచి విషయాలను మీ జీవితంలో పాటించడానికి ప్రయత్నించండి.

★ **బొమ్మలతో నాటకాలు:** మంచి గుణాలు ఉన్న బొమ్మలను తయారు చేసి, వాటితో మంచి విషయాలు చెప్పే నాటకాలు వేయండి. ఉదాహరణకు, ఒక బొమ్మ అందరికీ సహాయం చేయడం, ఇంకో బొమ్మ నిజం చెప్పడం లాంటివి.

★ **ప్రతిరోజూ ఒక మంచి పని:** ప్రతిరోజూ మీరు ఒక మంచి పని చేయాలని గుర్తుపెట్టుకోండి. అది ఎవరికైనా నవ్వు తెప్పించడం కావచ్చు, ఒక పక్షికి నీళ్ళు పెట్టడం కావచ్చు.

పిల్లలూ, ఈ విషయాలన్నీ మీరు గుర్తుపెట్టుకుంటారని నమ్ముతున్నాను. మీరందరూ చాలా తెలివైన వాళ్ళు. మీరందరూ మంచిగా చదువుకొని, మంచి నడవడికతో సమాజంలో గొప్ప పేరు తెచ్చుకోవాలని నా కోరిక. మీ జీవితం ఎప్పుడూ వెలుగులతో నిండి ఉండాలని ఆశిస్తున్నాను. మీరందరూ ఎప్పుడూ సంతోషంగా ఉండాలి! ఉంటాను మరి! బాయ్ బాయ్!

మీ రమణ సర్...

**– ఉమ్మడి వెంకటరమణ,**
ములకల చెరువు మండలం, అన్నమయ్య జిల్లా, 8500195123





# వృత్తి బోధన.. ప్రవృత్తి సేవ..




**ఉ**పాధ్యాయ వృత్తి అనేది ఉద్యోగం కాదు..... విద్యార్థుల జీవితాన్ని తీర్చిదిద్దే ఒక పదునైన ఆయుధం.. ఈ సూత్రాన్ని బలంగా నమ్మిన ఒక మాస్టారు తన జీవితాన్ని విద్యార్థులకు అంకితం చేశారు.. వృత్తిరీత్యా ఇంగ్లీష్ టీచర్, కానీ ఆయన ఎన్నో బాధ్యతలు తన భుజాన వేసుకున్నారు.. తరగతి గదిలో పాఠాలు బోధించడంతో పాటు, తన ఇంటినే ఒక తరగతిగది గా మార్చుకుని "Sridhar Tells It" యూట్యూబ్ ఛానల్ ద్వారా కొన్ని వేల మంది విద్యార్థులకు ఇంగ్లీష్ ఈజీ అనే వినూత్నమైన టెక్నిక్ తో పాఠాలు బోధిస్తున్నారు.. అంతేకాదు సాయంత్రం స్కూల్ బెల్ కొట్టేసిన తరువాత ఇంటికి వెళ్లిన తరువాత పేద పిల్లలకు, తన స్కూల్లో చదువుతున్న విద్యార్థులకు, చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేకంగా ట్యూషన్లు చెప్తూ.. వ్యక్తిగతంగా ప్రతీ స్టూడెంట్ మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.. ఆదివారాలు, సెలవు రోజుల్లో కూడా పిల్లలని ఇంటికి పిలిపించుకొని, ఉదయం నుండీ సాయంత్రం



వరకూ వారి సందేహాలు నివృత్తి చేసి, తన ఇంట్లోనే భోజనం పెట్టి పంపించేవారు. తన దగ్గర చదువుకున్న పూర్వ విద్యార్థులకు ఏదైనా సహాయం కావాలన్నా చేస్తుంటారు.. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన బి.వి శ్రీధర్ బాబు మాస్టారు గురించి తెలుసుకుందామా.

ఉమ్మడి కృష్ణా జిల్లా నూజివీడులో జన్మించిన బి.వి.శ్రీధర్ బాబు బహుముఖప్రజ్ఞాశాలి. ఉపాధ్యాయుడు కావాలనే లక్ష్యాన్ని సాధించి ఇంగ్లీష్ టీచర్ గా పనిచేస్తున్నారు.

## ఉపాధ్యాయునిగా ఎన్నో రికార్డులు...

విస్సన్నపేట జడ్పీహైస్కూల్లో2015 నుండి 2023 బి.వి శ్రీధర్ బాబు ఇంగ్లీష్ టీచర్ గా విధులు నిర్వర్తిస్తున్న రోజుల్లో అక్కడ పిల్లలకి విద్యాబోధన చేసే విషయంలో కొత్త ప్రమాణాలు నెలకొల్పారు. 2023 మార్చి విద్యా సంవత్సరంలో ఆయన దగ్గర చదివిన ఒక విద్యార్థినికి ఆంగ్లంలో 99 మార్కులు రాగా, ఒకే సెక్షన్ నుండి 12 మంది విద్యార్థులు 90కి పైగా మార్కులు సాధించి ఎన్టీఆర్ జిల్లాలో రికార్డు సృష్టించి వార్తల్లో నిలిచింది.

విస్సన్నపేట మండలం నరసాపురం జడ్పీహైస్కూల్లో2023 జూన్ నుండి ఇంగ్లీష్ టీచరుగా విధులు నిర్వర్తిస్తున్నారు. తను పనిచేస్తున్న పాఠశాల కోసం దాతల నుండీ లైబ్రరీ పుస్తకాలు, మైక్ సెట్, ఆటపాటలకి కావాల్సిన ప్రత్యేక దుస్తులు, క్రీడా సామగ్రి మొదలైనవి తీసుకొచ్చారు. విద్యార్థుల మేధో స్థాయిని బట్టి బోధన చేస్తూ, ఇంగ్లీష్ అంటే భయం పోయేలా వారిని తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు టీచింగ్ లో చురుగ్గా ఉంటూ మరోవైపు పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష



నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాల్లో రీసోర్స్ పర్సన్‌గా ఉన్నారు.. విద్యార్థి దశ నుండే రాయడంలో పట్టు ఉన్న శ్రీధర్ మాస్టారు SCERT కార్యక్రమాల్లో పాల్గొంటూ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో భాగస్వామ్యమయ్యారు..




"My English Buddy" గ్రామీణ ప్రాంత విద్యార్థులలో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచడం కోసం శ్రీధర్ మాస్టారు ప్రత్యేకంగా ఒక పుస్తకాన్ని రూపొందించారు. "My English Buddy" అనే పేరుతో రిలీజ్ చేసిన ఈ పుస్తకాన్ని తాను పనిచేసే స్కూల్లో ఉన్న విద్యార్థులందరికీ దాతల సహకారంతో ఉచితంగా ఇచ్చారు.

ప్రాణం పోసిన శ్రీధర్ మాస్టారు ఫేస్ బుక్ పోస్ట్...

బి.వి శ్రీధర్ మాస్టారు పూర్వ విద్యార్థి అయిన ధనుష్, ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష రాసి ఇంటికి వెళ్తుండగా బైక్ ప్రమాదంలో





తీవ్రంగా గాయపడ్డాడు. తలకి బలంగా దెబ్బతగిలి, మెదడు మొత్తం బయటకి వచ్చేసింది. రక్తస్రావం కూడా ఎక్కువగా జరగడంతో కిందపడిన వెంటనే కోమాలోకి వెళ్లిపోయాడు. పొలాల్లో కూలిపనులు చేసుకుని బ్రతుకు జీవనం సాగించే ధనుష్ తల్లిదండ్రులు తమ కుమారుడిని విజయవాడలోని ఒక ప్రైవేటు హాస్పిటల్లో చేర్పించారు. ధనుష్ తలకి రెండు మూడు సర్జరీలు అవసరం అవుతాయని 8 లక్షల వరకూ ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు.. ఈ విషయం తెలుసుకున్న శ్రీధర్ బాబు మాస్టారు పదివేల రూపాయలు సహాయంగా అందించారు. కానీ, అవి ఏ మూలకీ సరిపోవని తెలిసి సహాయం కోరుతూ ఫేస్బుక్ లో పోస్ట్ చేశారు. ధనుష్ కుటుంబ నేపథ్యం తెలుసుకున్న శ్రీధర్ బాబు ఫేస్బుక్ మిత్రుల నుండి అనూహ్యంగా స్పందన వచ్చింది. మూడురోజుల్లోమూడులక్షల రూపాయలు సమకూర్చారు.. ఆ మొత్తాన్నీ ధనుష్ తల్లిదండ్రులకి అందజేశారు శ్రీధర్ మాస్టారు. ఇంకా అవసరం అని మళ్లీ ఈ పోస్టులను షేర్ చేయగా, భైరవీ ఫౌండేషన్ అధినేత ఎన్నారై కోగంటి కళ్యాణి మరో



మూడు లక్షలు సమీకరించి ఆపరేషన్ చేయించారు. ఫేస్బుక్ ఫ్రెండ్స్, దాతల సహకారంతో కలిసి రెండో ఆపరేషన్ కూడా చేయించారు శ్రీధర్ మాస్టారు. కోలుకున్న ధనుష్ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు కూడా రాశాడు. ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టిన ఈ సంఘటన ఎంతో స్ఫూర్తిదాయకం. నరసాపురం జడ్పీహైస్కూల్లో చదివిన ఐదుగురు బాలికలు ఉన్నత విద్యను అభ్యసించడానికి భైరవీ ఫౌండేషన్ సహకారం అందించగా, శ్రీధర్ సార్ మెంటార్ గా వ్యవహరించారు. ఉపాధ్యాయునిగా తన బాధ్యత నిర్వర్తిస్తూ, ఎన్నో సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యమైన శ్రీధర్ మాస్టార్ అందరి మన్ననలు పొందుతున్నారు.

**– అమలాపురపు దుర్గాప్రసాద్,**
జర్నలిస్ట్, 9701171211

# నిజమైన విజన్..




# స్కూల్ ఫుల్

### విద్యా వ్యవస్థలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయి.

### విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విజన్ నిజమవుతోంది.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతున్నాయి. కొన్ని పాఠశాలల్లో అయితే ఏకంగా నో అడ్మిషన్ బోర్డులు పెట్టాల్సి వచ్చింది.

ప్రైవేటుకి ధీటుగా తయారైన గవర్నమెంట్ స్కూళ్లలో సీట్ల కోసం పిల్లల తల్లిదండ్రులు ఎగబడుతున్నారు.

తమ స్కూలులో ఇంకా పిల్లల్ని చేర్చుకోలేమని చెప్పి...చెప్పీ అలిసిపోయిన టీచర్లు, సిబ్బంది పాఠశాల మెయిన్ గేటు వద్దే... పెద్ద పెద్దగా నో అడ్మిషన్స్ అంటూ బోర్డులు వేలాడదీశారు.

ఈ విప్లవాత్మకమైన మార్పులు ఒక్కరోజులో వచ్చినవి కావు. విద్యాశాఖా మంత్రిగా నారా లోకేష్ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచే ఆరంభమయ్యాయి. మొదట పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే బడులను రాజకీయాలకు దూరం చేశారు. మౌలిక సదుపాయాల కల్పన, సమస్యల పరిష్కారం ఒక్కొక్కటిగా చేసుకుంటూ వెళ్లారు. ఉపాధ్యాయులకు బోధనేతర విధులు తగ్గించారు. సంస్కరణల అమలు ఆరంభించారు. ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ దిశగా అడుగులు వేయడం మొదలు పెట్టారు. వీటన్నింటి ఫలితమే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల ఎదుట కనిపిస్తున్న నో అడ్మిషన్ బోర్డులు.




## ఆదోని.. అదుర్స్

కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలకు బడి తెరిచిన నాటి నుంచి ప్రతి రోజు సిఫారసు లేఖలతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడిలో చేర్చుకోవాలని క్యూ కడుతున్నారు. ఇప్పటికే 6 నుంచి పదో తరగతి వరకు పాఠశాలలో 1,725 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో గదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్‌లో విద్యార్థులకు చోటు చాలక పోవడంతో స్కూల్ ఎంట్రన్సులో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు.



## 450 పైగా అడ్మిషన్లు..

రాష్ట్రంలో అత్యధికంగా విద్యార్థులు చదువుతున్న పురపాలక పాఠశాలల్లో ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులు చదువుతున్నారు. 2025– 26 విద్యా సంవత్సరానికి 450 పైగా అడ్మిషన్లు చేసుకున్నారు. ఒక్క ఆరో తరగతిలో 298 పైగా అడ్మిషన్లు అయ్యాయి. ఒక్కో తరగతి గదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు.

## బోడపాడు..



మార్కాపురం మండలం బోడపాడు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కళకళలాడుతోంది. ఈ పాఠశాలకు విద్యార్థుల సంఖ్య పెరగడమే కాకుండా పక్క గ్రామాల విద్యార్థులు ఇక్కడికే వచ్చి చేరారు. 2024కి ముందు ఈ పాఠశాలలో 30 మంది విద్యార్థులు ఉండేవారు. వీరికి ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే పాఠాలు చెప్పేవారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 130 మందికి చేరింది. ఉపాధ్యాయులు ఐదుగురు ఉన్నారు. మా స్కూల్ ఫుల్ అని బోర్డు పెట్టే పరిస్థితి వచ్చింది.

## సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసలు

ఈ ఏడాది మార్చి 8న మార్కాపురం వచ్చిన ముఖ్యమంత్రి సభా కార్యక్రమంలో బోడపాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ధీర వనితల వేషధారణతో, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చిన్నారులను అభినందించారు.

## నెల్లూరు మున్సిపల్ స్కూలులో సీట్లు లేవు..

నెల్లూరు, బి.వి. నగర్ లోని కురుగంటి నాగిరెడ్డి నగరపాలక ఉన్నత పాఠశాలలో సీట్ల కోసం కార్పొరేటు స్కూలు కంటే ఎక్కువ పోటీ ఉంది. నగరంలోనే ఈ పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు వుంది. ప్రైవేట్ విద్యా సంస్థలకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉపాధ్యాయులు ఇక్కడ విద్యాబోధన చేస్తుంటారు. అంతేకాదు పరీక్షలలో మంచి ఫలితాలను కూడా సాధిస్తుంటారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాలలో ఈ స్కూలు




విద్యార్థి ఒకరు పదికి పది పాయింట్లు సాధించడమే కాదు, ఎక్కువ శాతం మంది విద్యార్థులు 9కి పైగా పాయింట్లు సాధించడం విశేషం. ఈ పాఠశాల సాధిస్తున్న మంచి ఫలితాలు, స్కూల్ వాతావరణం చూసి ఉన్నత, మధ్య తరగతి కుటుంబాల వాళ్లు కూడా తమ పిల్లలను ఇక్కడ చేర్చడానికి ఉత్సాహం చూపించారు. కాబట్టే ప్రతి ఏటా ఈ స్కూల్లో 1400మందికి తక్కువ కాకుండా విద్యార్థులుంటున్నారు. ఈ ఏడాది అయితే 7 నుండి 10వ తరగతి వరకు సీట్లు ఖాళీయే లేవు. సీట్ల కోసం పెద్దఎత్తున దరఖాస్తులు రావడంతో 'సీట్లు లేవు' అంటూ ప్రధానోపాధ్యాయులు ఇక్కడ ఫ్లెక్సీని ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

## ఈ పథకాలతోనే సత్ఫలితాలు

* సన్న బియ్యంతో విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం
* సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రలో పుస్తకాలు, డిక్షనరీలు, యూనిఫాం, బ్యాగు, బెల్టు, షూ పంపిణీ







* ప్రపంచంలోనే అతిపెద్ద పేరెంట్-టీచర్ మీటింగ్ MEGA PTM నిర్వహించి గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధన
* 'తల్లికి వందనం' ప్రతిష్ఠాత్మక పథకం ద్వారా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో 1 నుండి 12వ తరగతి చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాల్లో పిల్లల సంఖ్యతో సంబంధం లేకుండా రూ. 8,745 కోట్లు ఖర్చుతో రూ. 13000/- ఆర్థిక సహాయం అందించడమైంది.
* టాపర్లే బ్రాండ్ అంబాసిడర్లుగా పదో తరగతిలో 4,168 మంది, ఇంటర్ లో 920మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్. రూ. 20 వేలు నగదు బహుమతి, మెడల్ తో సన్మానం.
* సైన్స్, స్పోర్ట్స్, పాఠశాల గ్రంథాలయాలు అభివృద్ధి, సమగ్ర విద్యా ప్రగతి కోసం 'హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు'లు, ఆట పాటల చదువు దిశగా.. ప్రతి శనివారం నో బ్యాగ్ డే నిర్వహణ, ఉపాధ్యాయులకు బోధనేతర భారం తగ్గించేలా 'లీప్' యాప్, కెరీర్ కౌన్సెలర్ల నియామకం, సెకండరీ పాఠశాలల్లో PAL ల్యాబ్స్ అమలు ఇలా ఎన్నో నూతన విధానాలు అమలవుతున్న ప్రభుత్వ విద్యాలయాలు విద్యార్థులు చేరేలా ప్రోత్సహిస్తున్నాయి.

## అన్ని బడుల ముందు నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలి

### విద్యాశాఖా మంత్రి నారా లోకేష్

ప్రభుత్వ పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డులు ప్రజల్లో పెరిగిన నమ్మకానికి నిదర్శనం.'నో అడ్మిషన్ బోర్డు పెట్టి, అడ్మిషన్స్ క్లోజ్ చేశామని తల్లిదండ్రులకు నచ్చజెపుతున్నా, మా పిల్లాడి ఒక్కడిని చేర్చుకోండి సార్' అని బతిమాలుతున్న స్థాయికి ప్రభుత్వ బడులను తీసుకొచ్చిన అధికారులు, టీచర్లు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు. రాష్ట్రంలోని ప్రతి స్కూలులో ఇలాగే నో అడ్మిషన్ బోర్డులు కనిపించాలి.. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కల్పించిన ఉపాధ్యాయులే ఏపీ మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దే రథసారథులు.



## అందుకే నో అడ్మిషన్ బోర్డు పెట్టాం

బోడపాడు హెచ్ఎం, **జాకబ్**

మా పాఠశాలలో తరగతి గదులు 2 మాత్రమే ఉన్నందున మార్కాపురం నుండి ఎక్కువ మంది విద్యార్థులు అడ్మిషన్ల కోసం రావటంతో మేము నో అడ్మిషన్ బోర్డ్ పెట్టాల్సి వచ్చింది. పాఠశాల అభివృద్ధికి స్థలం లేనందున అదనపు తరగతి గదులు కట్టిస్తే ఇంకా విద్యార్థులను చేర్చుకునే అవకాశం ఏర్పడుతుంది. దానితో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను నియమించాలని కోరుతున్నాం.



## పేదలకు కార్పొరేట్ విద్యను అందించడమే లక్ష్యం

- బోడపాడు టీచర్ **శ్రీనివాసులు**

గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించాలన్నదే లక్ష్యం. రూ.4లక్షలతో పాఠశాలలో అభివృద్ధి, వసతుల కల్పనకు కృషి చేశాం. మార్కాపురం పరిసర ప్రాంతాల లోని సుమారు 20 గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తుండడం సంతోషంగా ఉంది. ప్రభుత్వ విద్యా పథకాలను తల్లిదండ్రులు వినియోగించుకోవాలన్నదే నా ఆశయం.



## చాలా సంతోషంగా ఉంది

**ఫయాజుద్దీన్,** హెచ్ఎం, ఆదోని

మా పాఠశాల గురించి ఈ సందర్భంగా చెప్పడం చాలా సంతోషంగా ఉంది, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉపాధ్యాయులకు అండగా ఉంటుంది. మా పాఠశాలలో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, అదనపు సౌకర్యాలు కల్పించి... ఉపాధ్యాయులను నియమిస్తే ఇంకా బాగుంటుంది. ఆంధ్రప్రదేశ్ విద్యా వృక్షానికి మా పాఠశాల ఆకాశమంత అద్భుతంగా నిలుస్తుందని మనస్ఫూర్తిగా నమ్ముతున్నాను.



## విద్యార్థులు పెరుగుతున్నారు..

**ఎం. విజయ్ ప్రకాశరావు,** హెచ్ఎం, కేవీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ నెల్లూరు

మా పాఠశాలలో పరిమిత సంఖ్యలో తరగతి గదులు ఉన్నాయి. చేరే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. విద్యార్థులు చేరుతున్న స్థాయిలో ఉపాధ్యాయుల సంఖ్య లేకపోవడంతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నాం. పాఠశాలలో ప్రస్తుతం 1350మంది విద్యార్థులు ఉన్నారు. 22 మంది ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు.



# యూ షేప్ సీటింగ్ ..
# నో యూజ్ ఫర్ బెటర్ టీచింగ్

**త**రగతి గదిలో పిల్లలు యూ ఆకారంలో కూర్చుంటే మంచిదని సూచిస్తూ 'స్థనార్థి శ్రీకుట్టన్' అనే మలయాళ సినిమా వచ్చిందట. దీని ఫలితంగా అనేక చర్చలు, మార్పులు చేర్పులు జరుగుతున్నాయని సామాజిక మధ్యమాల ద్వారా తెలుస్తున్నది. ఈ విషయంపై నాకు ఇలా అనిపించింది.

1. వెనుక బెంచీలలో కూర్చునే పిల్లలు చదువులో వెనుకబడ్డవారనే అభిప్రాయం ఉంటే వాళ్లను మధ్య బెంచీల పిల్లలతో లేదా ముందు బెంచీల పిల్లలతో కలిపి కూర్చోబెట్టవచ్చు
2. చదువు చెప్పడంలో మార్పులు చేసుకోవచ్చు. ఉదాహరణకు బోధనలో పిల్లలను భాగస్వాములను చేయడం, బోధనా సామాగ్రిని వాడటం, ప్రయోగాలు చేయడం, ఆడియో వీడియో పద్ధతులు వాడటం వంటివి మెరుగైన ఫలితాలు ఇవ్వవచ్చు.
3. పరీక్షలు పెట్టినపుడు తక్కువ మార్కులు సాధించిన వారికి ఆ టాపిక్ మరోసారి చెప్పి అదే పరీక్ష మళ్లీ నిర్వహించాలి.
4. ఇన్ని చేసినా మారకపోతే ఆ విద్యార్థికి ఆసక్తి ఉన్న అంశంవైపు దృష్టి సారించాలని చెప్పవచ్చు.
5. నాలుగో పాయింట్ కూడా సాధ్యం కాకపోతే, ప్రస్తుతం సమాజంలో ముఖ్యమైన పదవులలో ఉన్న వాళ్ళు, వ్యాపారాలు చేస్తున్నవాళ్లలో కొందరు అంతగా చదువుకున్న వాళ్ళు కాదని ఏదో ఒక వృత్తి, ఉపాధి, వ్యాపారం చేసి బతకవచ్చని చెప్పవచ్చు.
6. యూ ఆకారంలో కూర్చుంటే చదువులో మార్పు ఏమీ ఉండదు. కేవలం బ్యాక్ బెంచర్ అనే పేరు మాత్రమే పోతుంది.
7. యూ ఆకార పద్ధతిలో ఎదురుగా వున్న పిల్లలు తప్ప మిగతా పిల్లలకు మెడ నొప్పులు రావచ్చు.
8. తక్కువ సంఖ్యలో విద్యార్థులు ఉన్న తరగతులకే యూ ఆకార పద్ధతి పని చేస్తుంది.
9. విద్యార్థుల వయసు రీత్యా కూడా ఈ పద్ధతి అందరికీ పనిచేయదు.
10. మార్పు టీచింగ్ లేదా లెర్నింగ్ లో రావాలి.

ఇక ఈ చర్చకు మూలకారణం బ్యాక్ బెంచర్ అనే మాట. పిల్లల చదువు గురించి మాట్లాడుతూ తల్లిదండ్రులు, టీచర్లు పిల్లలను మొద్దులని, బ్యాక్ బెంచర్స్ అని, యావరేజ్, పూర్, డల్, వంటి లేబుళ్లు, బ్రాండ్లు వేస్తుంటారు. ప్రోగ్రెస్ రిపోర్ట్ లో కూడా ఇలాంటి కామెంట్లు రాయడం చాలా స్కూళ్ళలో చేస్తుంటారు. శారీరక అంశాలను బట్టి కూడా పిల్లలను పిలవడం, ఇతర పిల్లలతో పోల్చడం, నెగెటివ్ కామెంట్లు చేస్తుంటారు. ఇలాంటి లేబుళ్లు పిల్లలను కుంగుబాటుకు గురిచేస్తాయి. దైనందిన వ్యవహారాలలో కూడా తల్లిదండ్రులు నెగెటివ్ బ్రాండ్లు వేస్తుంటారు. ఇవి వారిపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. ఒక సారి లేబుల్ పడితే దాన్ని తొలగించడానికి చాలా శ్రమించాలి.

చాలా సందర్భాలలో మా అమ్మాయి / అబ్బాయి గణితంలో పూర్ అని, ఇంగ్లీషులో పర్వాలేదు వంటి లేబుళ్లు వేస్తుంటారు. పిల్లలు కూడా ఫలానా సబ్జెక్ట్ టఫ్ అని ఫలానా సబ్జెక్ట్ ఈజీ అని స్థిరఅభిప్రాయాలతో ఉంటారు. ఒక సబ్జెక్ట్ లో వెనుకబడటానికి సరైన కారణాలను వెతికి వాటిని పూరించ గలిగితే ఏ సబ్జెక్ట్ లోనైనా ప్రగతి సాధించవచ్చు.

అనుమానాలు నివృత్తి చేసుకునేందుకు పిల్లలను ప్రోత్సహించాలి. చాలా మంది విద్యార్థులు అడిగితే ఎవరేమంకుంటారో అని బిడియంతో అడగరు. అడిగితే ఒక్కసారే ఫూల్ అవుతారు, అడగకపోతే జీవితాంతం ఫూల్ అవుతారనే విషయాన్ని చెప్పాలి.

పూర్, గుడ్ అనడానికి బదులు ఏ సబ్జెక్ట్ లో మరింత శ్రద్ధ పెట్టాలో, ఏ సబ్జెక్ట్ లో బాగా ప్రయత్నించారో ఒకటి రెండు మాటలు రాస్తే బాగుంటుంది. ఉదాహరణకు ఇంగ్లీషులో "ప్రశ్నలకు జవాబులు బాగా రాశావు. గ్రామరుపై దృష్టి పెట్టు" వంటి వాక్యాలు పిల్లలకు ఉపయోగపడవచ్చు. ఇలాగే ప్రతి సబ్జెక్ట్ లో లోటుపాట్లు వివరిస్తే మంచిది.

చదువులలో పిల్లలు వెనుకబడటానికి కారణాలను టీచర్లు సులభంగానే గుర్తిస్తారు. తరగతి గదిలో పాటించవలసిన కొన్ని రొటీన్స్ అమలుచేస్తే చాలా వరకు పిల్లలు బాగానే అర్థం చేసుకుంటారు. లోపాలను సరిచేస్తూనే ఎంకరేజింగ్ కామెంట్లు చెయ్యడం వలన మంచి ఫలితాలు వస్తాయి.

– డా. పుల్లూరి సంపత్ రావు



# సహిత విద్య.. భవితకు బాట

- ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు సమగ్ర విద్య అందించేందుకు ప్రత్యేక దృష్టి
- దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్రశిక్ష కృషి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్రశిక్ష ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రతి ఏటా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు, సాధారణ విద్యార్థుల కంటే దేనికి తీసిపోరు అనే ఉద్దేశంతో సహిత విద్యతో భవితకు మార్గం చూపుతోంది. దివ్యాంగ విద్యార్థులను సాధారణ పాఠశాలల్లో చేర్చడం ద్వారా వారికి సమాన అవకాశాలు కల్పించడం ద్వారా వారికి ఇతరులతో కలిసి నేర్చుకునే వాతావరణాన్ని అందిస్తుంది. దివ్యాంగ విద్యార్థుల ప్రత్యేక అవసరాలకు నాణ్యమైన విద్యను అందించడానికి అనుగుణంగా ప్రత్యేక ఉపాధ్యాయులతో బోధన, సామగ్రి ఉంటుంది. విద్యార్థుల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ అభివృద్ధికి తోడ్పడటం. విద్య కేవలం విద్యాపరమైన విజయాలకే పరిమితం కాకుండా, వారి వ్యక్తిత్వ వికాసానికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నారు. దివ్యాంగ విద్యార్థులు సమాజంలో గౌరవప్రదమైన స్థానాన్ని పొందడానికి కృషి చేస్తున్నారు.

## సమగ్ర శిక్ష ఏం చేస్తోందంటే...?

* ప్రతి సంవత్సరం బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించడానికి సర్వే నిర్వహిస్తారు. ఈ సర్వే ద్వారా 0 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బడి బయట ఉన్న ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి వారిని దగ్గరలోని ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేస్తున్నారు.
* గుర్తించిన 0–18 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగ పిల్లలకు వారి అవసరాలకు అనుగుణంగా భవిత కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా ప్రత్యేక విద్య, ఫిజియోథెరపి, స్పీచ్ థెరపి, పూర్వ ప్రాథమిక విద్యను ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా బోధిస్తారు.
* తీవ్ర, అతి తీవ్ర వైకల్యం కలిగి పాఠశాలకు హాజరు కాలేని పిల్లలకు ప్రతి శనివారం వారి ఇంటి వద్దకు వెళ్లి అక్కడే వారికి గృహ ఆధారిత విద్యను అందజేస్తున్నారు.
* ప్రత్యేక అవసరాలు గల పిల్లల్లో వైకల్యాన్ని అంచనా వేసి, దాని తీవ్రతను గుర్తించి వారికి సరియైన ఉపకరణాలను అందించడానికి నిష్ణాతులైన ప్రొఫెసర్ల ఆధ్వర్యంలో మండల స్థాయిలో వైద్య నిర్ధారణ క్యాంపులు (Medical Assessment Camps) నిర్వహించడం, వారికి కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (ALIMCO) ద్వారా వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్ళు, వీల్ ఛైర్లు, రోలేటర్లు వంటి ఉపకరణాలను ఉచితంగా విద్యార్థులకు అందజేస్తున్నారు.

## ఎన్నో కార్యక్రమాలు

* సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ సహకారంతో గ్రహణం మొర్రి, గ్రహణ శూల విద్యార్థులకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించడం.
* భవిత కేంద్రాలకు హాజరవుతున్న విద్యార్థులకు ఫిజియోథెరపీ సేవలు అందించడానికి ఫిజియోథెరపీ ఉపకరణాలు, ఉన్నత పాఠశాలల్లోని ప్రత్యేక అవసరాలు విద్యార్థులకు బోధనోపకరణాలు అందజేయడం.
* సహిత విద్యా రీసోర్స్ పర్సన్లకు, స్పెషల్ ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం.
* సమ్మిళిత విద్య, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పట్ల అవగాహన కోసం తల్లిదండ్రులు, ఎన్జీవోలు, హెడ్మాస్టర్లు, డైట్ కళాశాల ప్రిన్సిపాళ్ళు, మండల విద్యా శాఖాధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం.
* సమ్మిళిత విద్య ప్రాముఖ్యతను తెలియజేసే ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, బ్రెయిలీ దినోత్సవం , వరల్డ్ ఆటిజం డే, ఫిజియోథెరపీ డే వంటి కార్యక్రమాలు నిర్వహించడం.






* ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు స్పోర్ట్స్, Exposer Visits నిర్వహించడం.
* దివ్యాంగ విద్యార్థులకు డిజిటల్ విద్యపై తర్ఫీదునివ్వడం.
* ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నమోదును పెంచడానికి, వారి తల్లిదండ్రులకు ఆర్థికంగా చేయూత అందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్కార్ట్ అలవెన్స్, రవాణా భత్యం (ట్రాన్స్ పోర్టు అలవెన్స్), గృహ ఆధారిత భత్యం, గర్ల్ స్టయిఫండ్, రీడర్ భత్యం వంటివి అలవెన్సులు అందిస్తోంది.

## డిజిటల్ విద్యతో ప్రోత్సాహం

దివ్యాంగ విద్యార్థులకు తమ దైనందిన జీవితంలో ఎవరి సహాయం లేకుండా తమ పనులు తాము స్వయంగా చేసుకునేలా ఈ ట్యాబుల్లో 33 రకాల యాప్ లను ఇన్ స్టాల్ చేశారు. వాటిని ప్రత్యేక ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. దృష్టిలోపం, వినికిడిలోపం, బుద్ధిమాంధ్యత, ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, డౌన్ సింద్రోమ్, అభ్యసనా వైకల్యం వంటి విద్యార్థులకు ఈ యాప్ లను ఉపయోగించి సులభంగా బోధించడం వల్ల వారి అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించవచ్చు. ఈ ట్యాబ్ లో ప్రత్యేకంగా పిల్లవాడికి చైల్డ్ ఐడి క్రియేట్ చేసి, ఉపాధ్యాయుల ట్యాబ్లో ఫ్యామిలీ లింకు యాప్ కు పిల్లవాడి ఐడీని లింక్ చేయడం వల్ల దివ్యాంగ విద్యార్థి ఈ ట్యాబు, ట్యాబ్ లో యాప్స్ ఉపయోగించిన సమయం, విద్యార్థి ఏ లొకేషన్, తదితర అంశాలను 'ఫ్యామిలీ లింక్ యాప్' ద్వారా ప్రత్యేక ఉపాధ్యాయుడు పర్యవేక్షిస్తారు. తద్వారా జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ఆన్లైన్ లో సులభంగా మానిటరింగ్ చేయవచ్చు. గూగుల్ లుక్ అవుట్ యాప్, కవి పిటిఎస్, లైవ్ ట్రాన్ స్క్రైబ్ తదితర యాప్ ల ద్వారా విద్యార్థులకు డిజిటల్ విద్యను అందిస్తున్నారు.

## విద్యాశాఖామంత్రి చొరవ

దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతి కోసం 679 భవిత కేంద్రాలు నిర్వహించడమే కాకుండా, దేశంలో మొదటిసారి ఆటిజం పిల్లల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 125 మున్సిపాలిటిల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. వీటిద్వారా ఆటిజం విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ప్రత్యేక శిక్షణ, చికిత్స, విద్యను అందించనున్నారు.

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖామంత్రి శ్రీ నారా లోకేష్ గారి చొరవతో కేంద్ర ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ట్రాన్స్ పోర్టు అలవెన్స్, ఎస్కార్ట్ అలవెన్సులు కింద పది నెలలకు రూ. 3 వేలు నుండి రూ. 6 వేలు చొప్పున అందించడానికి అంగీకరించింది. 2025-26 విద్యా సంవత్సరంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల అభివృద్ధికి MHRD-PAB ద్వారా రూ. 6346.75 లక్షలు ఆమోదించింది.

## ఈ విద్యా సంవత్సరంలో అమలు చేయనున్న కార్యక్రమాలు

### ఉచిత వైద్య నిర్ధారణ శిబిరాలు (Medical Assessment Camps), ఉచిత ఉపకరణాల పంపిణీ:

సర్వే ద్వారా గుర్తించిన 6 నుండి 18 సంవత్సరాల వయస్సు గల ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన ఉపకరణాల నిర్ధారించే నిమిత్తం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండల స్థాయిలో వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. వైద్య శిబిరాల్లో అవసరమని గుర్తించిన దివ్యాంగులకు వారి వైకల్యం రకాన్ని బట్టి వారికి అవసరమైన సహాయ ఉపకరణాలు ఉచితంగా అందిస్తారు. పిల్లలు దీనివల్ల వైకల్యం వల్ల కలిగే అవరోధాన్ని అధిగమించి సాధారణ పిల్లల్లా పాఠశాలకు వెళ్ళి చదువుకోవడం, వారి దైనందిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయిలో 1310 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు, మాధ్యమిక స్థాయిలో 1808 మంది ప్రత్యేక అవసరాల గల విద్యార్థులకు అందించనున్నారు.

### బాలికలకు స్టైఫండ్

నూరు శాతం అక్షరాస్యత సాధించడం, ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగబాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి వారి చదువు కొనసాగించేలా సమగ్ర శిక్ష అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. అందులో భాగంగా దివ్యాంగ బాలికల హాజరు శాతాన్ని పెంపొందిస్తూ వారు క్రమం తప్పకుండా పాఠశాలలకు హాజరయ్యేలా చేయడానికి 1 నుండి 12వ తరగతి చదువుచున్న ప్రత్యేక అవసరాలు గల బాలికలకు ప్రతి విద్యార్థికి సంవత్సరానికి నెలకు రూ. 200 చొప్పున పది నెలలకు గానూ రూ. 2000/- ప్రత్యేక అలవెన్సు అందజేస్తారు. ప్రాథమిక స్థాయిలో 19,232 మంది, మాధ్యమిక స్థాయిలో 8287 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు లబ్ధి పొందనున్నారు. వీరికి డీబీటీ





విధానంలో సహాయక భత్యం అందిస్తారు. దీనికోసం రూ. 550.38 లక్షలు కేటాయించారు.

## రవాణా భత్యం

సుదూర ప్రాంతాల నుండి రావడానికి ఇబ్బంది పడుతున్న దివ్యాంగ విద్యార్థులకు ఆర్థికంగా ప్రోత్సహిస్తూ వారి హాజరును పెంచేందుకు, రవాణా భత్యాన్ని (ట్రాన్స్ పోర్టు అలవెన్స్) దివ్యాంగ బాలబాలికలకు అందిస్తారు. ప్రభుత్వ పాఠశాలలో నమోదై, భవిత కేంద్రంలో 1 నుండి 12 తరగతుల మేథో వైకల్యం, వినికిడి లోపం, పూర్తి అంధత్వం, ఆటిజమ్ గల దివ్యాంగ బాల బాలికల హాజరు శాతాన్ని పరిగణించి రవాణా భత్యం అందిస్తారు. ప్రతి విద్యార్థికి సంవత్సరానికి నెలకు రూ. 600 చొప్పున పది నెలలకు గానూ రూ.6000/- అందిస్తారు. ప్రాథమిక స్థాయిలో 3932 మంది, సెకండరీ స్థాయిలో 4058 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు డీబీటీ విధానంలో అందించనున్నారు. దీనికోసం రూ. 479.4 లక్షలు కేటాయించడమైంది.

## సహాయక భత్యం (ఎస్కార్ట్ అలవెన్స్)

మస్తిష్క పక్షవాతం (CP), బహుళ వైకల్యం (MD) బధిర-అంధత్వం గల దివ్యాంగ పిల్లలు పాఠశాలలో నమోదు కాబడినప్పటికీ వారంతట వారుగా బడికి హాజరు కాలేరు. అలాంటివారు స్వతంత్రంగా కాక సహాయకుని ద్వారా మాత్రమే పాఠశాలకు రాగలరు. అలా దివ్యాంగులను పాఠశాలకు తీసుకువచ్చే సహాయకులను ప్రోత్సహిస్తూ కొద్దిపాటి మొత్తం సమగ్ర శిక్ష ద్వారా అందించే చిరుసాయమే 'సహాయకుల భత్యం' (ఎస్కార్ట్ అలవెన్స్). ప్రభుత్వ పాఠశాలలో నమోదై ఎస్కార్ట్ సాయంతో వస్తున్న 1 - 8వ తరగతిలోపు చదువుతూ కనీసం నెలకు 40% హాజరుతో పాఠంశాలకుహాజరయ్యే దివ్యాంగ బాలబాలికలకు ఎస్కార్ట్ భత్యం అందిస్తారు.

## గృహ ఆధారిత విద్య

తీవ్ర, అతి తీవ్ర, మేధా వైకల్యం కలిగి పాఠశాలలకు వెళ్లలేని ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు మరియు కండరాల కదలికలు సమన్వయం లేని పిల్లలు, ప్రజ్ఞా లబ్ది 35 %కంటే తక్కువగా ఉన్న బుద్ధిమాంద్యత కలిగిన పిల్లలకు సహిత విద్యా వనరుల ఉపాధ్యాయులతో ఇంటి వద్దనే విద్యను అందిస్తున్నారు. ఈ విద్యార్థులకు పది నెలలకు రూ.3000/- చొప్పున అందిస్తారు. ప్రాథమిక స్థాయిలో 6,790 మంది విద్యార్థులకు రూ. 203.7 లక్షలు కేటాయించారు.

## హెల్పర్ / ఆయాలు / అటెండెంట్

రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో 679 భవిత కేంద్రాలు నిర్వహిస్తోంది. భవిత కేంద్రాల్లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల సంరక్షణ కోసం 679 మంది హెల్పర్/ ఆయాలు/ అటెండెంట్లను నియమించడం జరిగింది. ప్రాథమిక స్థాయిలో ఒక్కో ఆయాకి రూ.7,000 చొప్పున గౌరవ వేతనం అందిస్తారు.

## చికిత్సాపరమైన సేవలు: (ఫిజియోథెరపిస్టుల సేవలు)

ఫిజియోథెరపిస్టులు వారంలో మూడు రోజులు, మూడు భవిత కేంద్రాలను సందర్శిస్తారు. మూడు మండలాల్లోని మస్తిష్క పక్షవాతం(CP), మేధో వైకల్యం (ID), శారీరక వైకల్యం (OH), కండరాల బలహీనత (Musc. Distrophy) మొదలైన వైకల్యాలతో బాధపడుతున్న చిన్నారులకు ఫిజియోథెరపీ సేవలు అందిస్తారు.

## క్రీడలు & అవగాహన – సందర్శన

ప్రత్యేక అవసరాల గల పిల్లలకు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో స్పోర్ట్స్, ఎక్స్ పోజర్విజిట్స్ నిర్వహిస్తారు. దీనిద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సాధారణ మానసిక స్థితి, ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరచడం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, మెరుగైన చలన నైపుణ్యాలు, మెరుగైన శారీరక ఆరోగ్యం అభివృద్ధి పరచడం, వైకల్యంతో పోరాడటానికి అవసరమైన ఆత్మ స్థైర్యాన్ని అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశం. ప్రతి జిల్లాకు రూ.1 లక్ష చొప్పున కేటాయించడమైంది.





### సహిత విద్యకు 'భవిత'వ్యం

"ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు (Children with Special Needs - CwSN) విద్యను అందించడం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఒక కీలకమైన లక్ష్యం. ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసింది. రాష్ట్రంలో 125 ఆటిజం కేంద్రాలను నిర్మించడానికి ప్రభుత్వం సంకల్పించింది. సాధారణ విద్యార్థుల కంటే వారు దేనిలో తీసిపోరు అన్నది నా నమ్మకం. ఆ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నాం.

– బి. శ్రీనివాసరావు IAS.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష



## పోదాం పద బడికి



అక్షరాలు రాయాలన్నా
లక్షణాలు నేర్వాలన్నా
పోదాం పద బడికి

మంచి బుద్ధులు రావాలన్నా
సత్ప్రవర్తనే కావాలన్నా
పోదాం పద బడికి

చదవడం, రాయడం నేర్పిస్తారు
చక్కని నడవడిక అందిస్తారు
పోదాం పద బడికి

విద్యా బుద్ధులు అందాలన్నా
మంచి స్థాయిలో ఉండాలన్నా
పోదాం పద బడికి

ఆట పాటలు ఆనందాలు
కథలు, కవితలు, కావాలన్నా
పోదాం పద బడికి

అందమైన అనుభూతులు ఉన్నాయి
అంతులేని ఆనందాలు ఉన్నాయి
పోదాం పద బడికి

పలక, బలపం తీసుకొని
స్కూలు డ్రెస్సు వేసుకొని
పోదాం పద బడికి

నాన్నకు టాటా చెప్పి
అమ్మకు ఒకమాట చెప్పి

పోదాం పద బడికి

– చింతకాయల వినయ్, GPS(TW) చాకిరేవులపాలెం,
రౌతులపూడి (మం), కాకినాడ, 7569812870

## మాకిష్టం (గేయం)

ప్రేమను పంచే అమ్మ అన్నా
ధైర్యాన్నిచ్చే నాన్న అన్నా
మాకు ఎంతో ఇష్టమంటా ..

అల్లరి చేసే అత్త అన్నా
తాయిలమిచ్చే మామ అన్నా
ఇంకా ఎంతో ఇష్టమంటా..
తాత అన్నా అవ్వ అన్నా
వాళ్ళు చెప్పే కథలు అన్నా
చందమామ వెన్నెలన్నా
రేగిపళ్ళ చెట్టు అన్నా
మరీ మరీమరీమరీఇష్టమంటా...(ప్రేమను)


బుడిబుడి అడుగుల నడక తోటి
పాఠశాలకు చేరుకొని పాఠాలే చదవడమంటే
మాకు ఎంతో ఇష్టమంటా...

చిట్టీచిట్టీచేతులతోటీ
చిన్నీచిన్నీ మొక్కలు నాటి
పచ్చదనమే పెంచడమంటే
ఇంకా ఎంతో ఇష్టమంటా.....

గురువు అన్నా దైవమన్నా
వాళ్ళు చెప్పే బోధలన్నా
మరీ మరీమరీమరీఇష్టమంటా .... (ప్రేమను)

– కట్టా ఏసునాధం, తెలుగు ఉపాధ్యాయుడు, ZPHS
గురువాజీపేట, ప్రకాశం జిల్లా, 9505269742.

## చుక్కలు కలపండి- రంగులు వేయండి




సౌజన్యం: www.freepik.com

# బొమ్మను చూసి కథ రాసేద్దాం

హాయ్ ఫ్రెండ్స్.. ఇక్కడ కొన్ని కథా చిత్రాలు ఉన్నాయి. వాటిని చూసి కథ అల్లుదామా...
కథతో పాటు మీ ఫొటో, చిరునామా పంపండి. బాగున్న వాటిని ప్రచురిస్తాం.

Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
Whatsapp : 8712652298, mail: manabadimagazine@gmail.com

















# బొమ్మ గీశానోచ్!




– **అఖిల,** ఇంటర్మీడియేట్ (ఎంపీసీ, 2వ సంవత్సరం),
కేజీబీవీ, శంకవరం, తూర్పు గోదావరి



**కె.లిఖిత,** 9వ తరగతి, డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకులం,
పూడూరు, నాయుడుపేట, తిరుపతి జిల్లా

## అమ్మ ప్రేమ చల్లన...



– **ఎం.జయశ్రీ,** 7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
పెంట, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా

## మా సంస్కృతి.. మేము కాపాడుకుంటాం




**ఎ.లక్ష్మీ ప్రసన్న,** 9వ తరగతి, డా. బి.ఆర్.అంబేద్కర్ గురుకులం,
పూడూరు, నాయుడుపేట, తిరుపతి జిల్లా





## మంచినేస్తాలు

అనగనగా ఒక ఊరు. ఆ ఊరి చివర ఒక పంట కాలువ ప్రవహిస్తూ ఉంది. పంట కాలువ అంటే తెలుసు కదా. పొలాలకు నీరు అందించే కాలువ. వర్షాకాలంలో అదనపు నీటిని సముద్రాలకు, చెరువులకు, నదులకు కలిసేది. అయితే ఆ పంటకాలువ ఒడ్డున ఒక పెద్ద వేపచెట్టు ఉంది. ఆ చెట్టుమీద ఎన్నో రకాల జీవులున్నాయి. అందులో ఒక గండుచీమ కూడా ఉంది. అయితే ఆ గండు చీమ అంటే వేపచెట్టుకు చాలా చాలా ఇష్టం.

ఇద్దరూ మంచి మిత్రులయ్యారు. రాత్రిపూట చీమ చెట్టు మొత్తం తిరుగుతూ ఎన్నో విషయాలు వేపచెట్టుకు చెబుతుండేది. వేప ఆకులపై తిరుగుతూ చెప్పే సంగతులను కొమ్మలను ఊపుకుంటూ ఊ కొడుతూ వినేది వేపచెట్టు. అలా కాలం జరుగుతూ ఉంది.

చెట్టు మీదున్న అన్ని జీవులు ఎక్కడెక్కడికో వెళ్లి ఆహారాన్ని సేకరించుకుని తిని వచ్చేవి. చీమ మాత్రం చెట్టుపై గూళ్లు కట్టుకుని నివసించేవి కొన్ని పక్షులు.

అయితే చీమ మాత్రం అన్నిచోట్లకు వెళ్లి ఆహారాన్ని సేకరించి తెచ్చి చెట్టు ఆకుల మధ్య దాచేది. దాచిన ఆహారాన్ని చెట్టు మీదున్న చిన్న చిన్న జీవులకు ముసలి జీవులకు, ఆరోగ్యం బాగాలేని వాటికి కొద్ది కొద్ది తన శక్తికొద్దీ ఆహారాన్ని అందించేది. అందుకే ఆ చీమ అంటే అంత ఇష్టం వేపచెట్టుకి.

ఆ చీమకు కూడా వేపచెట్టంటే చాలా చాలా ఇష్టం. ఎందుకంటే ఎన్నో రకరకాల జీవులు ఆ చెట్టుపై జీవ వైవిధ్యాన్ని జరుపుతున్నాయి. ఎన్నోరకాల జీవులు ఒకదానిపై ఒకటి ఆధారపడుతూ కలసిమెలసి జీవిస్తూ ఉండడాన్ని జీవ వైవిధ్యం అంటారు. వేపచెట్టు ఎన్నో జీవులకు ఆవాసాన్నిచ్చింది. అన్ని జీవులను ప్రేమగా చూసుకుంటుంది వేపచెట్టు. కొన్ని జీవులు కాండాన్ని కొరుకుతూ ఉంటాయి. కొన్ని జీవులు కొమ్మలను విరిచేస్తున్నాయి. కొన్ని జీవులు ఆకులను కొరికి తింటున్నాయి. కొన్ని జీవులు పువ్వులను, కాయలను, పండ్లను, చిగుళ్లను తింటున్నాయి. అయినా ఆ పనులన్నిటినీ ఆహ్లాదంగా స్వీకరిస్తుంది వేపచెట్టు. అవన్నీ తన పిల్లలే అనుకుంటుంది. అందుకే గండుచీమకు వేపచెట్టంటే అంతిష్టం.

ఇలా కొంతకాలం గడిచింది.

వర్షాకాలం వచ్చింది. 2 రోజుల నుండి వర్షాలు కురుస్తున్నాయి. దాంతో పంటకాలువ నిండుగా నీటి ప్రవాహంతో ఉంది. ఉధృతంగా ప్రవహిస్తుంది.

చీముకు ఆహారాన్ని తెచ్చి చెట్టుపై జీవులు అందించాలి. కొన్నిటికి 2 రోజుల నుంచి ఆహారం లేదు వర్షం వల్ల కొంచెం తెరపి రావడంతో ఎలాగైనా ఆహారాన్ని సేకరించడానికి బయలుదేరాలనుకుంది. కింద కాలువ ప్రవాహం వేగంగా ఉంది. కానీ తప్పక వెళ్లాలి. వేపచెట్టు వారిస్తున్నా వినకుండా కాలువలోకి దిగడానికి ప్రయత్నించింది. కాలువ దాటి అవతలి ఒడ్డుకు ఆహారం దొరుకుతుంది. చెట్టుపైనున్న కొన్ని జీవులకు ఆహారం అత్యవసరం.

కాలువ ఒడ్డుకు చేరి కాలువలోకి దిగిందిచీమ. కొంత లోతుకు దిగాక ప్రవాహ వేగానికి కొట్టుకుపోయే స్థితి వచ్చింది. అంతా చూస్తున్న వేపచెట్టుకు భయమేసింది. చీమకు అపాయం జరగకూడదు. ఏం చేయాలో అర్థం కాలేదు.

చీమ చెప్పిన హెచ్చరిక గుర్తుకు వచ్చింది. తనకు కదలవద్దని చెప్పింది. కదిలితే కదలలేని జీవులు కింద కాలువ ప్రవాహంలో పడితే ప్రమాదం అని చెప్పింది.

ఇప్పుడు చీమ ప్రవాహ వేగానికి కొట్టుకు పోతుంది. చీమ హెచ్చరికను పక్కనపెట్టి శరీరాన్ని కొద్దిగా కదిలించింది. ఎక్కడో ఎండిన కొమ్మ జారి నీటిలో పడింది. అది కూడా చీమతో పాటు పోతుంది. గమనించిన చీమ చటుక్కున చెట్టు కొమ్మకున్న ఆకును పట్టుకుంది.

ఇది చూడని వేపచెట్టు మిత్రుడికి అపాయం జరగకూడదని మనస్ఫూర్తిగా కోరుకుని మిత్రునికై వేచి చూస్తూ ఉంది.

చీమ తను పట్టుకున్న ఆకుపై కూర్చుంది. పడవ ప్రయాణం చేసినట్టు ఆనందం అనుభవిస్తూ ప్రవాహానికి చాలా దూరం వెళ్లిపోయింది. ప్రవాహం తగ్గడానికి ఒక రోజు పట్టింది. వేగం తగ్గి నెమ్మదిగా ఒడ్డుకు చేరింది చీమ.

చీమ చాలా వేగంగా ఆహారాన్ని సేకరించింది. వర్షం తగ్గాక జీవులన్నీ బయటకు వస్తున్నాయి. అలా తనకు దొరికిన ఆహారాన్ని చాలానే సేకరించింది. మీకు తెలుసా? చీమ తన శరీరం బరువుకన్నా 10 రెట్లు ఆహారాన్ని మోయగలుగుతుంది.

మిత్రుడ్ని చూసి చాలా ఆనందపడింది. చెట్టు నెమ్మదిగా ఆకులను ఊపింది. చల్లగాలికి సేదతీరి తెచ్చిన ఆహారాన్ని జీవులకు పంచడానికి వెళ్లింది. అందరినీ పేరు పేరునా పలకరించి ఆప్యాయంగా ఆహారాన్ని అందించింది.









అదంతా చూసిన వేపచెట్టు మిత్రమా అయిందా. నీకు కొంచెం అన్నా ఉంచుకున్నావా' అడిగింది

నవ్వుతూ.

నాకు లేకపోయినా ఫర్వాలేదు. నీ ఆకులను పూలను కొంచెం తినేస్తాలే నాకేంటి నీవు ఉండగా అంటూ నవ్వింది.

ఆనందంగా చెట్టు మొత్తం తిరిగింది. దాని కాళ్ల స్పర్శకు వేపచెట్టు ఒళ్లంతా చక్కలిగింతలు వచ్చాయి. ఒళ్లంతా వయ్యారంగా తిప్పుకుంది. వెంటనే గండుచీమ ఆకులతో కప్పేసి పడుకుంది. తల్లి తన బిడ్డను హత్తుకున్నట్లు నూరేళ్లు చల్లగా జీవించమని మనస్ఫూర్తిగా కోరుకుంది వేపచెట్టు. అలా ఆ రెండు నేస్తాలు చాలా రోజులు కలిసి ఉన్నాయి.

మనం గమనించాలే కానీ చెట్లు కూడా నవ్వుతాయి. మనతో స్నేహంగా ఉంటాయి. మనం స్పర్శిస్తే అవి మురిసిపోతాయి. చెట్లను పెంచండి. ఆనందాన్ని, మానసిక ఉల్లాసాన్ని పొందండి.

– అద్దంకి విజయలక్ష్మి, రిటైర్డ్ టీచర్

## మీకు తెలుసా?

1. 2011జనగణన ప్రకారం అత్యధిక జనాభా గల రాష్ట్రం
   *ఉత్తరప్రదేశ్*
2. ఢిల్లీ స్పోర్ట్స్ యూనివర్సిటీ తొలి వైస్ ఛాన్సలర్ ఎవరు?
   *కరణం మల్లీశ్వరి*
3. 'జాతీయ ప్రతిజ్ఞ' తెలుగులో రచించింది?
   *పైడిమర్రి వెంకట సుబ్బారావు*
4. భారతదేశంలో ప్రత్యేకంగా విద్యా ప్రయోజనాలపై ఉపయోగించిన మొట్టమొదటి ఉపగ్రహం? *ఎడ్యుశాట్*
5. 'అసమర్థునిజీవయాత్ర' నవల రచయిత? *త్రిపురనేని గోపీచంద్*
6. రాజ్యాంగ రచనకు పట్టిన కాలం?
   *2సంవత్సరాల 11 నెలల 18 రోజులు*
7. అత్యధిక విద్యుత్ వాహకత కలిగిన లోహం? *వెండి*
8. ప్రకృతిలో గల అతి తేలికైన వాయువులు ఏవి?
   *హైడ్రోజన్, హీలియం*
9. 'దేవి అహల్యబాయి అంతర్జాతీయ విమానాశ్రయం' ఎక్కడ కలదు? *ఇండోర్, మధ్యప్రదేశ్*
10. కాంతి కణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది ఎవరు? *న్యూటన్*

నిర్వహణ: **ధవళ తారా శంకర ప్రసాద్,**
M.A, M.ed, PGDES:BLisc,

## జాతీయ జెండా

కాషాయ రంగు
ధైర్యంగ ఉందు !
ఐకమత్య మే
బలముగ ఉందు !

తెలుపు రంగు
శాంతిగ మెలుగు !
సత్య జీవనమే
బ్రతుకు వెలుగు !

పచ్చ రంగు
శుభం కి చిహ్నం !
ప్రకృతి జీవనమే
అభివృద్ధి కారకం!

అశోక చక్రం
ధర్మం నిందు !
చట్ట ప్రకారమే
సక్రంగ ఉందు !

దేశ భక్తి తో
గుండె నిండా !
ఎగరేద్దామా
జాతీయ జెండా !



– తిప్పాన హరి రెడ్డి,
విజయవాడ

9493832412,

## అమ్మంటే



అమ్మంటే
ఎలా ఉండాలో
ఏం మాటాడాలో
ఏది అనాలో
చెప్పడమే కాదు
నడక – మాట – నేర్పింది నిజం
దేవుణ్ని చూపించింది
నాకు దేవుడే అమ్మ రూపం కాదు,
అమ్మ దేవుని రూపం
అందుకే అమ్మంటే ఇష్టం.

– కె. హనీష్ సూర్య, 6వ తరగతి,



Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur